భూసార పరీక్ష.. అధిక దిగుబడికి రక్ష

- భూమిలో లోపాల గుర్తింపు
- భూసారం పెంచేందుకు రైతులకు సూచనలు, సలహాలు
- జోరుగా మట్టి నమూనాల సేకరణ

తుని రూరల్: రైతులు ప్రతి సంవత్సరం ఒకేపంటను సాగు చేయడం, అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటంతో భూసారం దెబ్బతింటుంది. ఫలితంగా రైతులు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టినా సరైన దిగుబడులు లభించక నష్టాల పాలవుతున్నారు. అటువంటి పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించేందుకు వ్యవసాయ అధికారులు ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేస్తూ తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. భూమిలో లోపాలను గుర్తించి ఎరువులు, ఇతర పోషకాలు ఏయే మోతాదులో వాడాలో రైతులు సూచిస్తున్నారు. తద్వారా రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతోంది.

73,750 ఎకరాల సాగు భూమి

వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 73,750 ఎకరాల ఖరీఫ్ సాగు భూములు ఉన్నాయి. 98 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల సిబ్బంది మండలానికి 50 చొప్పున ఐదు మండలాల్లో 250 మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించి భూసారాన్ని గుర్తిస్తారు. పరీక్షా ఫలితాలను ఆయా రైతుల మొబైల్ ఫోన్లకు నేరుగా సమాచారం ఇస్తారు. లోపాలను గుర్తించి, లోప నివారణకు తగిన సూచనలు చేస్తారు. ఈ ప్రక్రియను ఖరీఫ్ సాగు చేపట్టే నాటికి పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



తుని మండలం రాజుపేటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వీఏఏలు

తుని సబ్ డివిజన్‌లో భూములు, సేకరించిన మట్టి నమూనాల సంఖ్య

మండలం	భూములు (ఎకరాల్లో)	మట్టి నమూనాల సంఖ్య
తుని	17,028	50
కోటనందూరు	13,984	50
తొండంగి	17,607	50
శంఖవరం	9,956	50
రౌతులపూడి	15,175	50
మొత్తం	73,750	250

అలాగే విత్తనాల మొలక శాతాన్ని గుర్తించేందుకు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా విత్తనాలు నాటారు.

రైతులకు బహుళ ప్రయోజనాలు



భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. భూసార లోపాలను సవరించడంతో భూములకు జీవం వస్తుంది. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గుతుంది వీటికి పెట్టే అదనపు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయి. రైతులకు ఆర్‌జీఎల్-2537, ఎంటీయూ-1064 రకం విత్తనాలను ఆర్‌బీకేలు ద్వారా అందిస్తాం. బీపీటీ-5204 విత్తనాలు రావలసి ఉంది. విత్తన మొలక శాతాన్ని గుర్తించిన తర్వాత విత్తనాలను పంపిణీ చేస్తాం.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని మండలం.



ఆర్‌బీకేలో ఖరీఫ్ విత్తనాలను మొలక కట్టిస్తున్న వీఏఏ

భూసార పరీక్షలతో ప్రయోజనాలు

భూములను బట్టి ఒకటి నుంచి ఐదు ఎకరాల్లో ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. అలా సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించి భూమిలో లోపాలను గుర్తిస్తారు. అనంతరం ఆయా లోపాలను అధిగమించేందుకు అవసరమైన సూక్ష్మ పోషకాలను రైతులకు సూచిస్తారు. కొంతమేరకు పోషకాలను ప్రభుత్వం అందిస్తుంది. రైతులు దమ్ము, దుక్కుల్లో సూక్ష్మ పోషకాలను కలియదున్నితే భూసారం పెరుగుతుంది. ఫలితంగా ఎరువులు, పురుగుల మందుల వాడకం, పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. దీంతో దిగుబడులు పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుంది.

క్లుప్తంగా

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

ప్రత్తిపాడు: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య, నోట్ పుస్తకాలను సిద్ధం చేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. మండలంలో 34 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వెరసి 48 ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 5,819 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. వీరికి 35,628 నోట్ పుస్తకాలు, 34,324 టెస్ట్ బుక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు బాలుర, బాలికలకు షూస్, సాక్స్‌లను పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ వివరించారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



జి.కొత్తపల్లి డ్రైన్‌లో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: గ్రామంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తొలగించారు. రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఇళ్లలోని వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చెత్త బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వాహనాల నిలుపుదల

గండేపల్లి: నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా బుధవారం జాతీయ రహదారిపై వెళ్లే ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను పోలీసులు నిలుపుదల చేశారు. తెల్లవారుజాము నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మండలంలోని బొర్రంపాలెం సమీపంలోని ఓ దాబా వద్ద గల ఖాళీ ప్రదేశంలో మధ్యాహ్నం వరకు నిలుపుదల చేశారు. దీంతో కొందరు వాహనదారులు అల్పాహారం, భోజనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్‌బియ్యం పట్టుకున్న అధికారులు

ఏలేశ్వరం: పట్టణంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని బుధవారం అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... స్థానిక గొల్లలమెట్ట వద్ద ఓ ఇంట్లో రేషన్‌బియ్యాన్ని నిల్వ ఉంచినట్టు రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో డిప్యూటీ తహసీల్దార్ గంధం రవి ఆధ్వర్యంలో అధికారులు ఇంటిపై దాడి చేసి 53 బ్యాగ్‌ల్లో నిల్వ చేసిన 2650 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పి.మహీంద్రపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు చిన్నారి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూములకు కౌలువేలం ఖరారు



చేబ్రోలులో బహిరంగ వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలులో సీతారామస్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలువేలం ఖరారైంది. దేవస్థానానికి చెందిన 41 ఎకరాల 85 సెంట్ల భూమికి అధికారులు బహిరంగ వేలం నిర్వహించగా రూ.3,17,500లకు వేలం ఖరారైంది. ఈ భూములకు వేలం ద్వారా గతేడాది రూ.2,94,000 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.23,500 అధికంగా ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ జి.అశ్విని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు వై.వెంకటాచార్యులు, బీవీఆర్ చౌదరి, జె.భీమశంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

గొల్లప్రోలు: మండలంలోని తాటిపర్తిలో గర్భిణులు, చిన్న పిల్లలకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది ఇళ్లకు వెళ్లి గర్భిణులు, చంటి పిల్లలకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేశారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నేరుగా బాలింతల ఇళ్లకు వెళ్లి తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలిసికోవడం, వారికి అవసరమైన టీకాలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి

కిర్లంపూడి: ఉల్లి మళ్లీ ఘాటెక్కింది. రోజురోజుకూ ఉల్లిపాయల ధరలు పెరగడంతో సామాన్యుడి గుండెల్లో దడ పడుతోంది. ప్రతికూరలో ఉల్లిపాయలు ఉండాల్సిందే. ఉల్లి లేకుండా కూర తినాలంటే ముద్ద దిగదు. ఏ కూరకైనా ఉల్లే కీలకం. కూరగాయల్లో ఉల్లే రారాజు అని చెప్పొచ్చు. అటువంటి ఉల్లిపాయల ధర ఇప్పుడు సామాన్యుడికి అందకుండా పైపైకి ఎగబాగతోంది. మొన్నటి వరకు కిలో ఉల్లి ధర రూ.20 ఉండగా ప్రస్తుతం మార్కెట్లో మూడో రకం ఉల్లి కూడా రూ.40 వరకూ పలుకుతోంది. దాంతో వినియోగదారులు ఉల్లిని కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. ఇటీవల టమాటా కూడా ఉల్లికి జతకట్టింది. కొద్ది రోజుల క్రితం కిలో టమాటా రూ.15 నుంచి 20 ఉండగా ప్రస్తుతం రూ.60కు పెరిగింది. అల్లం ధర ఇప్పటికే చుక్కలనంటింది. ప్రస్తుతం కిలో అల్లం రూ.240 పలుకుతోంది. దాంతో పావు కిలో అల్లం కొనాలంటేనే లెక్కలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కూరల్లో కావలసిన ఉల్లి, టమాటా, అల్లం ధరలకు రెక్కలు రావడంతో సామాన్యుడి జేబుకు చిల్లుపడుతోంది.



కిర్లంపూడి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారం వీక్షణ

ప్రత్తిపాడు: రాష్ట్రంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మండల ప్రజలు వీక్షించేందుకు వీలుగా సచివాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో అధికారులు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపంలో పెద్ద తెర ఏర్పాటు చేశారు. సీఎం, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు, అధికారులు వీక్షించారు. ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, ఏపీఎం వై.వెంకట్, ఏపీఓ కుమారస్వామి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై గ్రామ ప్రజలు ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం వీక్షించేందుకు ఏర్పాట్లు

గండేపల్లి: నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవాన్ని లైవ్‌లో వీక్షించేందుకు స్థానిక మండల పరిషత్, తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలు, వివిధ శాఖల అధికారులు సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న అధికారులు, ప్రజలు

జగన్ చిత్రపటం ధ్వంసం



కొత్తకొట్టాం గ్రామ సచివాలయంపై ఉన్న జగన్ చిత్రపటాన్ని ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు

కోటనందూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచే టీడీపీ కార్యకర్తల విధ్వంసం మొదలైంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో వైఎస్సార్ సీపీ, జగన్ ఫ్లెక్సీలు, చిత్ర పటాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు సైతం చేశారు. కాగా బుధవారం మండలంలోని కొత్తకొట్టాంలో గ్రామ సచివాలయం, ఆర్బీకేలపై ఉన్న మాజీ సీఎం జగన్ చిత్రపటాలను పగలకొట్టి కింద పడేశారు. టీడీపీ కార్యకర్తల విధ్వంస కాండ పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హిందూ సమ్మేళనం పోస్టర్ విడుదల

జగ్గంపేట: హిందూ వారసత్వ పరిరక్షణ కోసం ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే హిందూ మతం సమ్మేళనం పోస్టర్‌ను మల్లిసాలలోని సిద్ధరామయ్య ఆశ్రమంలో బుధవారం విడుదల చేశారు. ఆశ్రమ యోగి సిద్ధరామయ్య, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, హెచ్‌పీఈ జాతీయ అధ్యక్షుడు శ్రీసాధు త్రినాథ్ దాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ మతంలోని లోపాలను సంస్కరించుకుని ద్వేషం, అసమానత్వాలకు చోటు లేని మహోన్నత హిందూ వారసత్వాన్ని రక్షించుకునేందుకు 19న హైదరాబాద్‌లో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్యూరాలటీ, ఈక్వాలటీ (హెచ్‌పీఈ) ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక గురువులు, సాధువులు ఈ సమ్మేళనానికి తరలివస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి మల్లిసాల స్వామిజీ యోగి సిద్ధరామయ్యను ఆహ్వానించడానికి వచ్చిన సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీఈ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి యోధ రాఘవదాస్, జై భారత్ జాతీయ అధికార ప్రతినిధి యోధ మల్లికావల్లభ, జై భారత్ సామాజిక విప్లవ రణభేరి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గోల, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మల్లిసాలలో హిందూ సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేసిన స్వామీజీలు

స్టూడెంట్ కిట్ల పంపిణీకి సర్వం సిద్ధం



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

- ఇప్పటికే పాఠశాలలకు చేరిన కిట్లు
- 5,819 మంది విద్యార్థులకు పంపిణీకి సన్నాహాలు

ప్రత్తిపాడు రూరల్: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. సుమారు రెండు నెలల తరువాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కాగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, షూ, బెల్టు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టైతో కూడిన కిట్లను పంపిణీ చేయనున్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునే వీటిని విద్యార్థులకు ఇవ్వనున్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని 34 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 5,819 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వం సర్కారీ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుభజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మధ్యాహ్నం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

తొలిరోజే పంపిణీకి చర్యలు



మండల పరిధిలోని 48 పాఠశాలల్లో 5,819 మంది విద్యార్థులకు పాఠశాలలు పునః ప్రారంభం రోజునే స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే కిట్లు పాఠశాలకు చేశాయి. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, షూ, బెల్టు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టైతో కూడిన కిట్లను అందిస్తాం.

–వి.రాజబాబు, ఎంఈఓ, ప్రత్తిపాడు

మెరుగైన సేవలు అందించండి

- లేదంటే చర్యలు తప్పవు
- కార్యదర్శులతో కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. స్థానిక కళాక్షేత్రంలో బుధవారం టౌన్ ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పరిష్కరించాల్సిన సమస్యలు, ఇతర అంశాల విషయంలో సచివాలయ కార్యదర్శులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే వారిపై కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు,, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో టెన్షన్

- ప్రమాదాలకు నిలయంగా చిన్నింపేట జంక్షన్
- బస్టాండ్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు

ఏలేశ్వరం: పదహారో నంబర్ జాతీయరహదారిపై మండల పరిధిలోని చిన్నింపేట జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ జంక్షన్ మీదుగా నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం వేలాది వాహనాలపై రాకపోకలు సాగిస్తారు. సిరిపురం నుంచి వచ్చే వాహనాలు ఈ జంక్షన్‌లో మలుపు తిరిగేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ బస్టాండ్ నిర్మించాలని గ్రామస్తులు ఎన్నోఏళ్లుగా కోరుతున్నారు. ప్రమాదాల సమయంలో వీధి దీపాలు ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ నియంత్రణకు బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన చిన్నింపేట జంక్షన్

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి

వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం



రఘురాం

జగ్గంపేట: రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, ఆ దిశగా అడుగులు వేయాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం కోరారు. జగ్గంపేటలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి నేతలు ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారని, అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను పారదర్శకంగా అమలు చేశారన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినా, ప్రజలు కొత్తదనం కోరుకున్నారన్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని భావిస్తున్నట్టు తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చిఉంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉండేదన్నారు. జగన్ వెంటే తామంతా ఉంటామని, భవిష్యత్‌లో కొత్త ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రశ్నిస్తామని తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



జగ్గంపేట బస్టాండ్‌లో ప్లాట్ ఫారంపైకి దూసుకు వచ్చిన బస్సు, గాయపడిన మహిళ

జగ్గంపేట: స్థానిక బస్టాండ్‌లో బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కాంప్లెక్స్‌లోకి వచ్చిన ఆర్టీసీ బస్ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ప్లాట్ ఫారంపైకి బస్సు దూసుకు వచ్చింది. అక్కడ ఐరన్ గ్రిల్స్ అడ్డుగా ఉండడంతో వాటిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన మోర్త సుబ్బయ్యమ్మ (60) తీవ్రంగా గాయపడింది. ఆమె కాలుకు బలమైన గాయమైనట్టు స్థానికులు తెలిపారు. ప్లాట్ ఫాంపై ఐరన్ గ్రిల్స్ లేకపోతే పెనుప్రమాదం జరిగేది. గాయపడిన మహిళను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయవాది శివ

ప్రత్తిపాడు రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఒమ్మంగిలో ప్రత్తిపాడు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు బుగత శివ, అవసరాలు దేవి, బొంగులూరి మధుబాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాలో పిల్లలు సమిదలవుతున్నారని వాపోయారు. ముఖ్యంగా బాలికలు తమ భవిష్యత్తును కోల్పోతున్నారని, ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు మండల లీగల్ సర్వీస్ కమిటీని సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది కుసుమంచి సూర్యప్రకాశరావు, గ్రామ ఉప సర్పంచ్ కొప్పన వెంకన్నబాబు, ఎంపీటీసీ సాధనాల అప్పారావు, కొప్పన గంగారావు, రామిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు తనిఖీలు

కాకినాడ రూరల్: జిల్లాలో బాల కార్మికుల గుర్తింపునకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల పేదరికం, నిరాక్షరాస్యత కారణంగా ఎందరో బాలలు బాల కార్మికులుగా కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులు పిల్లలతోనే చేయిస్తున్నారన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని రాజ్యాంగం పేర్కొందన్నారు. ఆ దిశగా బడి ఈడు పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. 14 ఏళ్లలోపు పిల్లలతో పని చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.